## క్లుప్తంగా

### రేపు ఉపాధిహామీ సామాజిక తనిఖీ

పూడూరు: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా 2024 నుంచి 2025 మార్చి వరకు జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ పాండు తెలిపారు. ఈ నెల 12న గురువారం పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో బహిరంగ సమావేశం ఉంటుందని చెప్పారు. మండల స్థాయిలో 31 పంచాయతీలకు సంబంధించి బహిరంగ సమావేశం ఉంటుందని అన్నారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

### కేటీఆర్‌ను కలిసిన కోట్ల మహిపాల్


కేటీఆర్‌తో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు

దౌల్తాబాద్: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోట్ల మహిపాల్ మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని సూచించారన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి


ప్రభుత్వ కళాశాలపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ రూపలక్ష్మి, అధ్యాపకులు

దోమ: పేద విద్యార్థులు ప్రభుత్వం కల్పించే వసతులు వినియోగించుకోవాలని దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రూపలక్ష్మి సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మోత్కూర్, రాకొండ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ కళాశాలలో ఉన్నటువంటి సదుపాయాలు, బోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు అధ్యాపకులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రథమ, ద్వితీయ సంవత్సర అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఉచితంగా ప్రవేశం పొందాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీధర్, రాధా, రాములు, లక్ష్మయ్య, సునీత, మధుసూదన్, శ్రీవిద్య, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, సానియాసుల్తాన తదితరులు పాల్గొన్నారు.

### క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి


శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య సూచించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం చంద్రకల్ గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఉన్న వారికి జ్వరం, దగ్గు, నీరసం బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు తప్పకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు చేయగా 20 మందిని అనుమానితులుగా గుర్తించారు. వీరికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి, రాహత్ సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తుల పాల్గొన్నారు.

### పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకోవాలి

శంకర్‌పల్లి: మండలంలోని రైతులు పండ్ల తోటలను పెంచుకోవడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలను పెంచుకోవడానికి సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా జామ, మామిడి, మునగ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పంటలు వేసుకోడానికి వీలుంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు దగ్గరలోని పంచాయతీ, ఉపాధి హామీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


పూడూరు: గొంగుపల్లిలో యూనిఫాంలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ


నవాబుపేట: లింగంపల్లిలో బడిబాట కార్యక్రమం

# సర్కారు బడికి రండి

- గ్రామాల్లో విస్తృతంగా బడిబాట
- పలు చోట్ల యూనిఫాంల పంపిణీ

పరిగి/పూడూరు/బంట్వారం/బొంరాస్‌పేట/కుల్కచర్ల/దుద్యాల్/మోమిన్‌పేట్/దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులున్నాయని, నాణ్యమైన విద్య అందుతుందని ఆయా ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల నిర్వహించారు. ఉచిత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి తదితర సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు.


దుద్యాల్: జీడిగడ్డ ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు


బొంరాస్‌పేట: రేగడిమైలారంలో..



కోట్‌పల్లిలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

### పప్పెట్ షోతో అవగాహన


ప్రదర్శన ఇస్తున్న డ్రాయింగ్ మాస్టర్ తిరుమలేష్

కొడంగల్ రూరల్: బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటూ ఉపాధ్యాయులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయులు తిరుమలేష్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది వినూత్నంగా పప్పెట్ షో(తోలు బొమ్మల ఆట)తో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బడిలో చేరాలంటూ అవగాహన కల్పించారు. మండలంలోని హుస్సేన్‌పూర్, గుండ్లకుంట, పాతకొడంగల్‌తండా, తదితర గ్రామాల్లోని బడి బయటి చిన్నారులను చేరదీస్తూ పాఠశాలల్లో చేరాలంటూ ప్రచారం నిర్వహించారు.



దోమ: దిర్సంపల్లిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ


దౌల్తాబాద్: ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

# ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కుల్కచర్ల: పేద ప్రజల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తున్నదని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని పీరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, గోపాల్‌నాయక్, జంగయ్య, భరత్‌కుమార్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


పీరంపల్లిలో ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

## పంటల సంరక్షణకు యాప్

కొడంగల్: రైతులు పంటలను కాపాడుకొని అధిక దిగుబడులు సాధించాలని కొడంగల్ వ్యవసాయ సహాయ ఉప సంచాలకులు శంకర్ రాథోడ్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలోని రైతు వేదికలో కృషివాస్ అనే యాప్ గురించి రైతులకు వివరించారు. ఈ యాప్ ద్వారా పంటలను ప్రతిరోజు గమనించడం ద్వారా రక్షించుకోవడం సులభమన్నారు. శాటిలైట్ నుంచి రైతులు పంట పొలాల్లో వచ్చే చీడ పీడలను గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టవచ్చన్నారు. పంటలకు సోకే చీడ పీడలకు తొలగించడం కోసం అనువైన పురుగు మందులను వాడడం గురించి వివరించారు.


సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

కార్యక్రమంలో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు రమణగౌడ్, జగదీశ్, మండల వ్యవసాయ అధికారులు తులసీ, నాగరాజ్, పోలప్ప, ఏఈఓలు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులతో సమావేశం


మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింగ్‌రావు

తాండూరు రూరల్: పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా వేడుకలు నిర్వహించాలని పెద్దేముల్ ఎంఈఓ నర్సింగ్‌రావు సూచించారు. మంగళవారం పెద్దేముల్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల తరగతి గదులను శుభ్రం చేయించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాను పునరుద్ధారించాలని సూచించాలన్నారు. ప్రారంభం రోజైనా గురువారం నాడు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. అదేరోజు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రతన్‌సింగ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు ఉన్నారు.

### లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

పూడూరు: వివాదాల పరిష్కారం కోసం ఈ నెల 14న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారు రాజీ చేసుకోవాలని చెప్పారు. అన్ని రకాల కేసులకు సంబంధించి లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉందన్నారు. పట్టింపులకు పోయి కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి కాకూడదన్నారు.

### ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్వాసన భరించలేం

మర్పల్లి: ధారూర్ మండల పరిధిలోని దోర్నాల సమీపంలో ఉన్న మరియ ఫీడ్ కంపెనీని మూసేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పశువుల కళేబరాలను దోర్నాలలో డంపు చేయడంతో చుట్టుపక్కల గ్రామస్తులు సైతం ఊపిరాడక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యం గ్రామానికి చెందిన యువకుడు కళేబరాలు తరలించే లారీలను అడ్డుకొని నిలదీయడం హర్షించదగ్గ విషయమన్నారు.

### ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

పూడూరు: భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తీర్ణణ అధికారి ఇలియాస్ తెలిపారు. ఆధార్ కార్డు మాదిరిగా 11 అంకెలతో యూనిక్ కోడ్‌ను కేటాయిస్తారని చెప్పారు. భూమి ఉన్న ప్రతి రైతు వివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసి డిజిటలైజ్ చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లోకి వచ్చిన వ్యవసాయ అధికారులకు సహకరించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

# బస్ పాస్ చార్జీలు తగ్గించాలి

ప్రజా, విద్యార్థి సంఘాల వినతి

తాండూరు టౌన్: టీజీ ఆర్టీసీ యాజమాన్యం పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని పలు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం తాండూరు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్‌పాస్ చార్జీలను పెంచడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆర్థిక భారం కానుందన్నారు. గతంలో ఉన్న చార్జీల కంటే సుమారు 25 శాతం పెంచడం సమంజసం కాదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సమయంలో బస్‌పాస్ చార్జీలను పెంచి మారుమూల ప్రాంత విద్యార్థులను కళాశాలలు, పాఠశాలలకు దూరం చేయరాదన్నారు. పెంచిన బస్‌పాస్ చార్జీలపై ఆర్టీసీ యాజమాన్యం పునరాలోచించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంజయ్ గౌడ్ తదితరులు డీఎంకు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.


తాండూరు డీఎం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**బస్సులు పెంచాలి**

కొడంగల్ రూరల్: రాష్ట్ర ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులకు ఇబ్బంది కలిగించేలా బస్ పాస్ చార్జీలను పెంచడం తీవ్ర అన్యాయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని రూట్లలో ప్రయాణికులు, విద్యార్థులకు అనుకూలంగా బస్సులను పెంచాలని, అలాగే పెంచిన బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

**ఇబ్బంది పడుతున్న విద్యార్థులు**

పరిగి: ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థులు బస్ పాస్ చార్జీలను 20% పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి సి.అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే పెంచిన బస్ చార్జీలు, స్టూడెంట్స్ పాస్ చార్జీలు కారణంగా గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు గ్రామాల్లో బస్సు సర్వీసుల పెంచాలని డిమాండ్ చేశారు.



## ఇళ్ల మధ్య మురుగు.. దుర్గంధం పరుగు!

దుద్యాల్: అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చిలుముల్ మైల్వార్ గ్రామంలో ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉండడంతో భరించలేని దుర్గంధం వ్యాపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దోమలు వృద్ధి చెంది అంటు వ్యాధులు సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది. ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు ఏరువాక పౌర్ణమి

కొడంగల్ రూరల్/దుద్యాల్: ఏరువాక పౌర్ణమి వచ్చిందంటే వర్షాకాలం మొదలైందని, రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతారు. ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, వాక ప్రారంభం అని అర్థం. మొత్తానికి ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభం అని రైతులు భావిస్తారు. ఆ రోజు ఎద్దులను శుభ్రంగా కడిగి, చక్కగా అలంకరిస్తారు. అనంతరం పశువులకు, పాకకు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు సైతం చేస్తారు. సాయంత్రం వేళల్లో గ్రామంలోని ప్రధాన దేవాలయాలు, చౌరస్తాల వద్దకు తీసుకువచ్చి ఊరేగింపు నిర్వహిస్తారు. ఏరువాక పౌర్ణమి దాటిందంటే చాలు పొలం పనుల్లో రైతులు నిమగ్నమవుతారు. దుద్యాల్‌లో సైతం పెద్దఎత్తునఏరువాక పండుగ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కొడంగల్ పట్టణంలో పండగకు ముందు రోజు తమ్మళి నరేందర్ కుటుంబ సభ్యులు వొన్నంగి(ర్యాలాకు) కొమ్మలను ప్రతీ ఇంటి ధర్వాజకు పెడుతూ ఇచ్చిన ధాన్యం, డబ్బులను తీసుకుంటారు.


ఎద్దుల బండ్లను ఊరేగిస్తున్న రైతులు (ఫైల్)

## స్థానిక పోరుకు సిద్ధం కండి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొత్లాపూర్‌కు చెందిన పార్టీ నాయకులు, గ్రామస్తులు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇందుకు సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు రాజయ్య, వసంత్‌నాయక్, బస్వరాజ్‌గౌడ్, శాంతప్ప, నర్సిములు, పాపయ్య, పాండు, మొగులప్ప, వెంకటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.


కొత్లాపూర్ కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

# రోడ్డు నియమాలు పాటించాలి


వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుల్కచర్ల: ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని హెడ్‌కానిస్టేబుల్ ఆంజనేయులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతకు సంబంధించిన జాగ్రత్తలను తీసుకోవాలని, నియమ నిబంధనలను పాటించాలని చెప్పారు. కారు నడిపే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించి ధ్రువ పత్రాలను దగ్గర పెట్టుకోవాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే యమపాశాలు

దుద్యాల్: మండలంలోని చెట్టుపల్లి తండా నుంచి బొల్లిబాయి తండాకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఎలాంటి రక్షణ గోడ లేకుండా రహదారికి పక్కనే ఈ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో రాత్రిపూట ఆదమరిచి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తే పెను ప్రమాదమే సంభవించే ఆస్కారం లేకపోలేదు. దీంతో రోడ్డుకు సమీపంలో ఎదురెదురుగా ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, మరో చోట అమర్చాలని తండావాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

